# కథ రాళ్ళబండి నీలిమ

కుండపోతగా కురుస్తున్న వర్షాన్ని కిటికీలోంచి చూస్తూ ఆలోచిస్తోంది వేద.

రెండు రోజుల్నించి కామా, ఫుల్‌స్టాప్ లేకుండా కురుస్తోంది వర్షం.

ఓటమిని ఒప్పుకున్నట్లుగా చెట్లు తలలు వంచుకుని మౌనరాగాలు పలికిస్తున్నాయి, తనలాగే.

అందమైన నల్లని ఆ రోడ్డు గుంటలు పడిపోయి రాళ్ళు రప్పలు బయటపడి అసహ్యంగా-నిస్సహాయంగా రోదిస్తోంది తనలాగే.

ఒకప్పుడు సంతోషంతో తుళ్ళిపడే ప్రతి ప్రాణిలో-వస్తువులో తననే ఊహించుకొని ఉప్పొంగిపోతుండేది.

# అద్దానికి అటువైపు...

మరి ఇప్పుడో-

ఆవేదన-నిరుత్సాహం-ప్రపంచం అంతా తనలో తాను కుమిలిపోతున్నట్లుగా తన నిరాశ-నిస్పృహల్ని ప్రకృతిలో లీనం చేసి మరీ కృంగిపోతోంది.

ఈ పరిస్థితికి కారణం తనేనా?

ముమ్మాటికి తనే...!

మనిషి సమస్యల్ని తనకు తానే సృష్టించుకుని దాని వెనుక పరుగులు తీస్తుంటాడు.

నిజమే! ఇది తన విషయంలో నిజంగా నిజమైంది.

"అమ్మా!..అమ్మా..వేదా..వేదా"

పీటర్ పిలుపుతో వేద ఆలోచనలకి చిన్న బ్రేక్.

మెల్లగా గదిలోకి నడిచింది.

మంచం మీద పీటర్- " నీళ్ళు కావాలి- వేదా- ప్లీజ్-నేనీ బాధ భరించలేను. వేదా- డాక్టర్‌గార్కి చెప్పు. నాకు వెంటనే ఈ బాధల నుంచి రిలీఫ్ కావాలి వేదా. నిన్ను వదిలి వెళ్లడం తప్పుకదా- ఇది చాలా చిన్న తప్పు వేదా-క్షమించరాని నేరం ఎప్పుడో చేసాను..వేదా..సారీ.." పీటర్ మత్తుగా ఏంటేంటో మాట్లాడుతున్నాడు.

నీళ్లు నిండిన కళ్ళు మసక బారుతుంటే నీళ్లగ్లాస్ అతని నోటి దగ్గర పెట్టి తాగించింది.

నెమ్మదిగా పీటర్‌ని పడుకోబెట్టి అతని జుట్టుని ప్రేమగా నిమురుతూ కూర్చుంది. మెల్లగా నిద్రలోకి జారిపోయాడు పీటర్.

* * *

వేద నాన్నగారు తిరువేంగళంగారు వేదపండితులు. వేదకి ముగ్గురు అక్కలు. సహజంగానే పిల్లల్ని కట్టుబాట్లతో పెంచారు-తిరువేంగళంగారు.

ముగ్గురి అమ్మాయిలు పెళ్లిళ్ల తర్వాత వేద ఆయనకి సమస్యే అయ్యింది. తాను బతికి ఉండగా వేదకి పెళ్ళి చేయగలనా అని తెగ దిగులు పడేవారు.

అప్పుడు వచ్చాడు బద్రినారాయణ.

వేదని చూసి ఇష్టపడి కానీ కట్నం లేకుండా చేసుకుంటానన్నాడు. పౌరోహిత్యం -అర్చకత్వం-పెద్దవాళ్ల పరిచయాలు బద్రి స్థితిమంతుడే అని తెల్సి సంతోషపడ్డారు తిరువేంగళంగారు. ఆ సమయంలో వేద మనసు తెలుసుకోవాలన్న ఆలోచన రాలేదు ఆయనకి.

వేదది ఒక రంగుల ప్రపంచం. ఉంటే అద్దం ముందు లేకపోతే అందమైన ఊహల్లో తేలిపోతూ కాలాన్ని గపడం అలవాటయ్యింది. టైట్‌జీన్స్, టీ షర్ట్‌తో వచ్చే అమ్మాయిలను చూసి, తను వేసుకున్న లంగా ఓణీని చూసుకొని చిన్నబోయేది.

పులిహోర, దద్దోజనం, చక్కెర పొంగలికి తన జీవితం అంకితం కాకుండా పిజ్జా, బర్గర్, పానీపూరీలతో ముడిపడాలని దేవుడికి వంద మొక్కులు మొక్కింది వేద.

పంచ కట్టు, జుట్టుముడి, తీక్షణమైన మూడు నామాలతో వచ్చి ముందు నిల్చున్న బద్రిని చూపించి 'ఇతనే నీ భర్త' అని తండ్రి పరిచయం చేస్తున్నప్పుడు వేద సునామీ తగిలిన దానిలా విలవిలలాడిపోయింది. తలదించుకుని లోపలికి వెళ్తున్న వేదనని చూసి సిగ్గుపడ్తుందనుకుని మురిసిపోయాడు బద్రి.

వేద ఇష్టా ఇష్టాలతో ప్రమేయం లేకుండా అందరూ పెళ్ళి పనుల్లో మునిగి తేలుతున్నారు. వాళ్ళమ్మగార్కి తెలియకుండా- కట్నం, లాంఛనాలు, పెళ్లి ఖర్చులకి బద్రినారాయణే డబ్బు తీసుకు వచ్చి తిరువేంగళం గారి చేతిలో పెట్టాడు.

వేద అదృష్టాన్ని అందరూ పొగుడుతున్నారు. వాళ్ల మాటలు వేదకి ఆటంబాంబు చప్పుళ్ళలా విన్పిస్తున్నాయి. వేద కోరుకున్న డబ్బు, హోదా అన్నీ బద్రి నారాయణ దగ్గర ఉన్నాయి. కానీ వేద మనసు మాట వినటం లేదు.

వేదకి బాగా గుర్తుంది. వాళ్లమ్మ ఏనాడు సిల్క్ చీర కట్టలేదు. జడ వేసుకుని పూలు పెట్టుకోలేదు.

ఎప్పుడు తొమ్మిది మూరల చీర-మడి కట్టు-ముడి.

నైవేద్యాలు-సంతర్పణలతో జీవితమంతా వంట గదిలోనే మసిబారిపోయింది.

"పిన్నీ.. తాతయ్య పిలుస్తున్నారు" పాప చెప్పింది.

కళ్ళు తుడుచుకుని తండ్రి దగ్గరకు నడిచింది వేద.

"అమ్మా! అల్లుడుగారు చీరలు, నగలు పంపారు. నీకు నచ్చినవి తీసుకో" అన్నారు తిరువేంగళంగారు.

మంచం నిండా పట్టు చీరలు నగలు.

'జీవితాన్ని పంచుకోబోయే వాడి గురించి తన అభిప్రాయం అడగని వీళ్ళు, కట్టి వదిలేసే చీరల గురించి తనని పిల్చి మరీ ఎంత చక్కగా అడుగుతున్నారో' విరక్తిగా నవ్వుకుంది వేద.

నగలు, చీరలు అక్కలు ముగ్గురు పోటీలు పడి సెలెక్ట్ చేసారు వేద కోసం.

వేద హృదయం మౌనంగా రోదిస్తోంది. ఏమి మాట్లాడలేదు. చూస్తుండిపోయింది అలాగే.

* * *

వేద మంత్రాల మధ్య-వేద నారాయణుని సాక్షిగా-వేద పెళ్లి వైభవంగా జరిగింది. ముచ్చటైన జంట అని అందరు మెచ్చుకున్నారు. వేద అత్తగారింట్లో అడుగు పెట్టింది.

అత్తగారు, మామగారు వృద్ధులు. ఆడపడచులు ఇద్దరు. మరిది ఒక్కడు. బద్రినారాయణే పెద్ద. అందరి బాధ్యత అతనిదే.

నలుగురి మధ్య పెరిగిన వేద తప్పకుండా తన వాళ్లలో కల్సిపోతుందని ఆశపడ్డాడు బద్రి...తన అభిప్రాయం తప్పని తెలుసుకోవడానికి ఎంతో కాలం పట్టలేదు.

వేద అందం బద్రీ బలహీనత-ఆమె మాటకి ఎదురు చెప్పలేదు. అలా అనీ బాధ్యతల్ని విస్మరించలేడు. ఓ నిర్ణయానికి వచ్చాడు.

ఆ ఊరి నుంచి మకాం మార్చాడు. హైదరాబాదులో ఇల్లు తీసుకున్నాడు. వేద తను ఇద్దరే. ఇటు

తనవారికి ఎలాంటి ఇబ్బంది కలుగకుండా చూసుకుంటూనే ఉన్నాడు.

బద్రీనారాయణ ఆదాయం పెరిగింది. సమాజంలో ఓ గుర్తింపు వచ్చింది. వేద కోరుకున్న విలాసవంతమైన జీవితం ఆమె సొంతం అయ్యింది. కారు, బంగళా, క్లబ్‌లో మెంబర్‌షిప్, వేద ఏది కోరితే అది.. వేద మాటే వేదం.

అయినా ఎక్కడో నిర్లిప్తత. బద్రీనారాయణ వేదలోని అసంతృప్తిని గమనిస్తూనే ఉన్నాడు. "ఇంకా నీకేం కావాలి వేదా? నీకు నేనేం తక్కువ చేసాను..నాతో ప్రేమగా నవ్వుతూ ఎందుకు మాట్లాడవు?" నిలదీసి అడగాలనుకుంటాడు బద్రీ. కానీ అడగలేదు.

కాలం ఎవరితో నిమిత్తం లేకుండా దొర్లిపోతోంది.





వేదకి ఇద్దరు అబ్బాయిలు. ఏ ఆధారం లేని వేద బంధువు ఒకావిడ వేద నీడన చేరింది. ఇద్దరు పిల్లల భారం ఆవిడదే. బద్రి అమెరికా వెళ్లాడు.

క్లబ్‌కి వెళ్ళడం, ఇంటర్‌నెట్ ఛాటింగ్, స్విమ్మింగ్ వేదకి క్షణం తీరిక ఉండటం లేదు.

"అమ్మా" అని ఆత్రంగా ఏదో చెప్పాలని దగ్గరికి వచ్చే పిల్లల్ని విసిరికొట్టేది. "అత్తమ్మని అడగండి..నన్ను విసిగించకండి" అంటూ ఆవిడ మీదకి నెట్టేసేది.

తల్లి ఆదరణకి నోచుకోని ఆ పిల్లల వేదన, రోదన వేద సరదాలకి ఏమాత్రం అడ్డుకట్ట వేయలేకపోయాయి.

అప్పుడే ఇంటర్‌నెట్‌లో పీటర్ పరిచయం అయ్యాడు. పీటర్ మాట తీరు-చలాకీతనం అన్నీ వేదని ఆకట్టుకున్నాయి. పీటర్ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. జీతం తప్ప మరే ఆదాయం లేదు. ఎప్పుడూ నవ్వుతూ, నవ్విస్తూ ఉంటాడు. వెనక ముందు ఎవ్వరు లేరు. సంపాదించడం, ఖర్చుపెట్టడం, జీవితాన్ని బరువుగా కాదు, జాలీగా గడపాలన్నదే అతని సిద్ధాంతం.

పీటర్ పరిచయంతో వేదలో అలజడి మొదలయ్యింది. ప్రతి విషయంలో పీటర్‌ని బద్రితో పోల్చుకొనేది. పీటర్ ఒక మెట్టుపైన ఉన్నట్టు అన్పించేది.

వేద-పీటర్‌తో తిరగడం తెల్సి బద్రీనారాయణ ఇండియా వచ్చేసాడు.

"ఇద్దరు పిల్లల తల్లివి. పరాయి మగవాడితో తిరగడం మంచిది కాదు. నీవొక సంప్రదాయ కుటుంబంలో పెరిగావు. ఇక్కడ ఒక వేద పండితుని భార్యగా నీకు ఓ ప్రత్యేకస్థానం ఉంది. నీవు వేసే తప్పటడుగు మన పిల్లల భవిష్యత్‌కి అవరోధమవుతుంది. ఆలోచించి ఈ ఆకర్షణ లోంచి బయటపడు వేదా" అంటూ ఎంతో నచ్చచెప్పాడు.

"నేను ఇష్టంతో పెళ్లి చేసుకోలేదు. ఇష్టపడి పిల్లల్ని కనలేదు. నీ పిల్లల గురించి నేనెందుకు ఆలోచించడం?"

వేద మాటలు శరాఘాతాల్లా తగులుతున్నాయి.

పిడుగు తలమీద పడ్డట్టు ఉలిక్కిపడ్డాడు బద్రి.

"నా పిల్లలా? వేదా ఏం మాట్లాడుతున్నావో తెలుస్తోందా? మన పిల్లలు కాదా..అయినా నీ సరదాలకి నేను, పిల్లలు ఎప్పటికి అడ్డుపడము. నీవు కోరినంత డబ్బు ఇస్తాను. నాకు మంచి భార్యగా కాకపోయినా, మంచి తల్లిగా నీ బాధ్యతలు నెరవేర్చు చాలు. ఇక నీ నుంచి నేను ఏమీ ఆశించను" ప్రాధేయపడ్డాడు బద్రి నారాయణ.

"కోరికలు చంపుకోవడానికి నాకేం వయసయిపోయిందని? నేను వాళ్లకి తల్లిగా మాత్రమే ఉండాలా? నాకంటూ ఓ ఆశ-కోరికా-జీవితం ఉండక్కర్లేదా?" విసురుగా అంది వేద.

కాళ్ల కింద భూమి చీలిపోయి తాను అందులో కూరుకుపోతే బాగుంటుందేమో అన్పించింది బద్రికి.

ఇలాంటి మాటలు వినవలసి వస్తుందని కల్లో కూడా ఊహించలేదు.

"అయితే నన్నిప్పుడు ఏం చేయమంటావు వేదా"

బద్రినారాయణ గొంతులో వణుకు.

"పిల్లల్ని తీసుకుని అమెరికా వెళ్లండి. పీటర్ లేనిదే నేను బతకలేను- నా సంగతి నేను చూసుకోగలను" తేల్చి చెప్పేసింది వేద.

"ఇది ఎలా సాధ్యం వేద- నేను సరే-నీకు పిల్లలు అక్కర్లేదా- మాతృహృదయం-తల్లిప్రేమ అంటూ ఏవేవో అంటారే-అలాంటివేం నీకు లేవా?" ఆవేశంగా అడిగాడు బద్రి.

"నాకు ఏమీ తెలియదు-నాకు పీటర్ కావాలి? అంతే!" ఖచ్చితంగా చెప్పింది వేద.

"నీకు పిచ్చెక్కింది వేదా- నీవు ఏం మాట్లాడుతున్నావో నీకు తెలియట్లేదు. అర్థంలేని ఆవేశంలో తీసుకునే నిర్ణయాలు శాశ్వతమైన ఆనందాన్ని ఇవ్వవు. వేదా- ఓ కన్న తల్లిగా ఆలోచించు. ఆ పసి మనసులని గాయపరిచి నీవు సాధించేది ఏమీ ఉండదు"

వేదకి ఏ విధంగా నచ్చజెప్పాలో అర్థం కావటం లేదు బద్రికి.

పరిస్థితి తన చేయిజారిపోతోందని మాత్రం అర్థం అయ్యింది.

"ఇక ఆలోచించేది ఏమీ లేదు. నా నిర్ణయం చెప్పన్నాను వినండి- రేపు నేను పీటర్‌తో వెళ్లిపోతున్నాను" తెగేసి చెప్పేసి భళ్ళున తలుపు వేసుకుంది వేద.

బద్రినారాయణ కళ్లముందు చీకటి తెరలు కమ్ముకుంటున్నాయి.

***

పీటర్‌తో వేద వైజాగ్ వెళ్లిపోయింది.

బద్రి తన పేర బ్యాంకులో వేసిన 20 లక్షల క్యాష్, నగలు అన్నీ పట్టుకెళ్లిపోయింది.

ఈ అవమానం తట్టుకోలేక, అందరిలో తలెత్తుకు తిరగలేక పిల్లలు అడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పలేక బద్రి సతమతమయిపోయాడు. గుండె రాయి చేసుకున్నాడు.

తన వెనుక జనం వెక్కిరింతల్ని, వెటకారాన్ని సహించాడు. మౌనంగా పిల్లల్ని తీసుకుని మారిషస్ వెళ్లిపోయాడు. మళ్లీ పెళ్లిమాట అనుకోలేదు. తల్లి లేని బాధ తెలియకుండా పిల్లల్ని పెంచాలనుకున్నాడు.

***

"వేదా..నొప్పి..నొప్పి వేదా"పీటర్ పిలుపుతో మళ్లీ ఈ లోకంలోకి వచ్చింది వేద.

బద్రి నుంచి దూరం వచ్చాక పీటర్, వేద చాలా ఆనందంగా గడిపారు. తనకు మళ్లీ పిల్లలు పుట్టే అవకాశం ఉందేమో అని డాక్టర్ని కూడా సంప్రదించింది వేద.

వేదనొక వెర్రిదాన్ని చూసినట్లు చూసింది డాక్టర్.

"ఈ వయసులో ఓ బిడ్డకి జన్మనివ్వాలనుకోవడం నీ ప్రాణానికే ప్రమాదం" అని మందలించింది.

దాంతో ఆ ప్రయత్నం మానుకుంది వేద.

పీటర్ సహచర్యం వేదని సర్వం మరిచిపోయేట్లు చేసింది.ఎప్పుడైనా పిల్లలు ఎలా ఉన్నారో, తనని ఎంత తిట్టుకుంటున్నారో అన్పించేది.

బద్రి గురించి కలలో కూడా ఊహించడానికి ఇష్ట పడేది కాదు. పిల్లల గురించి ఆరా తీస్తే పెద్దవాడు ఇంజనీరింగ్, చిన్నవాడు డిగ్రీ చేస్తున్నాడని తెల్సింది.

ఫోన్ చేసి మాట్లాడాలన్పించేది.

"వాళ్ల తిరస్కారాన్ని భరించలేక మనసు పాడు చేసుకోవడం ఎందుకు?" అని పీటర్ వారించాడు.

వేద జీవితంలో ఓ భయంకరమైన రోజు...

పీటర్-వేద వెళ్తున్న కారుకి యాక్సిడెంట్ అయ్యింది. వేదకి చిన్న చిన్న దెబ్బలు తగిలాయి. పీటరకి ఓ కాలు తీసేసారు. రెండో కాలు కూడా బాగా దెబ్బ తింది. తలకి కూడా బలమైన దెబ్బే తగిలింది. రక్తం గడ్డకట్టి పీటర్ కోలుకోలేని పరిస్థితి. రెండో కాలు కూడా ఇన్‌ఫెక్షన్ ఎక్కువ కావడంతో అది కూడా తీసేయాల్సి వచ్చింది.పీటర్ ఈ దెబ్బలకి తట్టుకోలేకపోయాడు. మానసికంగా బాగా కృంగిపోయాడు. తన అవిటి జీవితాన్ని ఊహించుకోలేకపోయాడు.

చిన్న పిల్లాడి లాగా ఏడ్వడం, ఏదేదో మాట్లాడటం, మెలకువ వచ్చినా మానసికంగా ధైర్యం లేకపోవడం వల్ల మళ్లీ స్పృహ లేకుండా పడిపోవడం. పీటర్ నరక యాతన వేదలో నిరాశ, నిస్పృహల్ని పెంచింది.

పీటర్‌కి -వేదని తాను తీసుకు వచ్చిన తప్పుకే ఈ శిక్ష అనే భావన బలపడిపోయింది.

ఇక పీటర్ ఎక్కువ రోజులు బతకడని డాక్టర్స్ తేల్చి చెప్పేసారు.

రోజా నర్స్ వచ్చి ఇంజక్షన్స్ ఇచ్చి వెళ్తుంది.

డాక్టర్స్ వచ్చి చూసి వెళ్తున్నారు. ఆఫీస్ వాళ్లు కొంత సాయం చేసారు. తర్వాత వేదకి తప్పలేదు.

వేద పరిస్థితి అంధకార బంధురంగా అయ్యింది.

పీటర్ ఆఫీస్ వాళ్లు ఇచ్చిన డబ్బు వైద్యానికి సరిపోతుంది. బ్యాంక్‌లో ఉన్న డబ్బుతో కాలం గడుపుతుంది.

పీటర్ తర్వాత... తనేంటి? ఏం చేయాలో...???

భగవత్ అపచారం కంటే భావగత అపచారం క్షమించరానిది అని తండ్రి ఎప్పుడూ చెప్తుండేవాడు.

బద్రిని అవమానించినందుకే ఈ శిక్ష?

బద్రి మంచితనాన్ని చేతకాని తనంగా భావించి అతని మనసు గాయపరిచినందుకా తనకీ కష్టాలు?

'ఆ యాక్సిడెంట్‌లో నేను పోయినా బాగుండేది' రోజుకి వెయ్యి సార్లైనా అనుకుంది వేద.

కొడుకు సాఫ్ట్‌వేర్ కంపెనీలో పనిచేస్తున్నాడని తెల్సి ఫోన్ చేసి పరిస్థితి చెప్పింది.

"సారీ! మా అమ్మ పోయి చాలా సంవత్సరాలైంది" ఫోన్ పెట్టేసినట్లు అవతల్నుంచి సమాధానం.

తర్వాత కొన్ని రోజులకి ఓ ఉత్తరం వచ్చింది.

'ఆప్తమిత్ర' వృద్ధాశ్రమం నుంచి- 'మీ పేరు మీద లక్ష రూపాయలు డొనేట్ చేసారు. మీరు ఎప్పుడైనా రావచ్చు' అని సారాంశం.వేదకి తన మీద చెప్పుకోలేనంత జాలి వేసింది. జాలికంటే అసహ్యం, అసహ్యం కంటే జుగుప్స కల్గింది.

***

"వేద నన్ను క్షమించు-వేదా-నిన్ను వదలి వెళ్తున్నాను. మనలాంటి తప్పు ఎవ్వరు చేయకూడదు. క్షణికావేశంలో ఆకర్షణలో మనం చేసిన తప్పులు మన వాళ్ళని బాధిస్తాయి. మనల్ని నిలువునా కాల్చేస్తాయి. వేదా" పీటర్ కళ్ళనీళ్ళు ధారలుగా కారిపోతుంటే ఏంటేంటో మాట్లాడుతున్నాడు.

"వద్దు పీటర్-ఈ ఆలోచనలేం పెట్టుకోవద్దు. నీవు ఏ తప్పు చేయలేదు. అసలైన పాపాత్మురాల్ని నేనే. నీవు నిద్రపో పీటర్" అతని తల నిమురుతూ ఏడుస్తోంది వేద.

"వేదా- ఇక నిద్రే నాకు మిగిలింది. హాయిగా నిద్రపోతాను-శాశ్వతంగా-నిన్ను వదిలి వెళ్తున్నందుకు మన్నించు వేదా" గొణుగుతున్నాడు పీటర్.

టాబ్‌లెట్ వేసి మెల్లగా పడుకోబెట్టి తల నిమురుతూ కూర్చుంది వేద.

***

తెల్లవారింది. వర్షం వెలిసింది.

సూర్యుడు నేనున్నానంటూ మళ్ళీ డ్యూటీలోకి వచ్చేసాడు.

వేదకి మెలకువ వచ్చింది.

వేద చేయి పీటర్ చేతిలో ఉంది.

"పీటర్...పీటర్" భయంగా పిల్చింది వేద.

పీటర్‌లో చలనం లేదు. తన చేతిని బలవంతంగా అతని చేతిలోంచి లాక్కుంది.

అతని నుదుటిమీద చేయిపెట్టి చూసింది.

చల్లగా ఉంది.

గది బయటి నుంచి పనమ్మాయి "డాక్టర్‌గారికి ఫోన్ చేయండమ్మా" అంటోంది.

వేద నిద్రలో నడుస్తున్న దానిలాగే లేచి ఫోన్ చేసింది డాక్టర్‌కి. అరగంటలో డాక్టరు వచ్చారు.

పీటర్‌ని చూస్తూ బొమ్మలాగా కూర్చుని ఉన్న వేదని చూడగానే అర్థం అయ్యిందాయనకి.

"ప్రాణం పోయి చాలాసేపే అయ్యింది" పరీక్షించి చెప్పాడు.

వేదలో ఎలాంటి ప్రకంపనలు లేవు.

పీటర్ ముఖంలో ఎంతటి ప్రశాంతత..!

అంతా నిశ్శబ్దం. వర్షం వెలిసింది.

ఆకాశంలో మబ్బులు లేవు. నిర్మలంగా ఉంది.

తుఫాన్ బీభత్సం లోంచి తేరుకుని బయటపడ్డ వాయుదేవుడు చల్లని గాలిని అందిస్తున్నాడు.

కాళరాత్రిని దాటి వెలుగుచూస్తున్న పక్షులు కేరింతలు కొడ్తూ గూళ్ళు విడిచి ఎగురుతున్నాయి.

'ఆప్తమిత్ర' అడ్రస్ వెతుకుతూ వేద ముందుకు నడుస్తూనే వుంది.

☆